న్యూస్‌రీల్

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

భీమారం: ఫిబ్రవరి 3న ప్రారంభం కానున్న గాంధారి మైసమ్మ జాతరకు పెద్దఎత్తున ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ సంఘం జిల్లా నాయకుడు పెద్దల బాపు కోరారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో జాతర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ వరకు జరిగే జాతరకు ఆదివాసీలు, గిరిజనులు తరలిరావాలని కోరారు. ఆదివాసీ నాయకులు గుంటి సుధాకర్, బైర్నేని కిష్టయ్య, నాగరాజు, రాములు పాల్గొన్నారు.

'కాసిపేట' కార్మికులకు రక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మంగళవారం రోల్‌ఆఫ్ మానిటర్ అండ్ ఇంప్లిమెంటర్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) జాన్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో ప్రమాదానికి అవకాశం ఉన్న విషయాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉత్పత్తితోపాటు నియమాలు పాటించడం, ప్రతి ఉద్యోగికి అవసరమని పేర్కొన్నారు. ఏరియా ఇంజినీర్ నాగరాజు, ఏజెంట్ విజయ్‌ప్రసాద్, డెప్యూటీ జీఎం రామనాథం, గ్రూప్ ఇంజినీర్ బసవరాజు, ఎస్ఎంటీసీ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, గని మేనేజర్ అల్లావుద్దీన్, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సంఘం నేతపై వ్యక్తిగత ఆరోపణలు సరికాదు'

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టే తరుణంలో శిక్షణ లేకుండా ముందుకెళ్లడంపై అనుమానం వ్యక్తం చేసిన లెక్చరర్ల సంఘం నాయకుడి అభిప్రాయాలపై కాకుండా వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇంటర్ విద్య జేఏసీ సంఘం మంచిర్యాల, కుమరం భీం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా సమయంలో మూల్యాంకాన్ని వ్యతిరేకించిన వారు, వ్యక్తిగత, గుర్తింపు పొందిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘంపై ద్వేషం పెంచుకున్న కొందరు రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. తప్పులు చేసిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జీఎం బి.సంజీవరెడ్డిని ఆవిష్కరించారు. మంగళవారం జీఎం కార్యాలయం వద్ద అసోసియేషన్ నాయకుల సమక్షంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. ఏజెంట్ సత్యనారాయణ, అధికారులు శ్రీధర్, మహేశ్, అసోసియేషన్ నాయకులు రాజన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల ఎంపికకు గ్రామసభలు

జైపూర్: మండలంలోని జైపూర్, ఇందారం, టేకుమట్ల, కుందారం, నర్సింగాపూర్, గంగిపల్లిల్లో మైనార్టీ రుణాల ఎంపికకు మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల దరఖాస్తులు, వివరాలను నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, స్థానిక సర్పంచ్ సువర్ణ రాజమల్లు, ఎంపీడీవో రామటెంకి లింగ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కట్టెలు మోపించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులతో కట్టెలు మోపించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో పనులు చేయించడం బాధకరమన్నారు. బాధ్యులను సస్పెండ్ చేయాలన్నారు. ఇదే విషయంపై ఎంఈవో పోచయ్యను సంప్రదిస్తే మధ్యాహ్నం భోజనానికి సంబంధించి గ్యాస్ అయిపోతే పక్కన ఇంటి నుంచి ఒక్కో కర్ర విద్యార్థులు తెచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సాగులో మహిళలే కీలకం

- నారు నుంచి కోత వరకు
- ఐకేపీ సెంటర్లలో వారిదే పై చేయి

మంచిర్యాల జిల్లాలో
కొనుగోలు కేంద్రాలు: 53
కొనుగోలు చేసిన ధాన్యం: 2,68,161.20



వరినాట్లు వేస్తున్న మహిళలు

చెన్నూర్‌రూరల్: అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఇలా ఒక్కటేమిటి అనేక రంగాల్లో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపిస్తున్నారు. వ్యవసాయంలో మహిళలే కీలకపాత్ర పోషిస్తున్నారు. అలాగే కిరాణా షాపులు, జనరల్ దుకాణాలు, కంగన్‌హాళ్లు, బ్యూటీపార్లర్లు, హోటళ్లు ఇలా తదితర రంగాల్లో రాణిస్తూ కుటుంబ బాధ్యతల్లో పాలు పంచుకుంటున్నారు. ముఖ్యంగా వరి, పత్తి ఇతర ఏ పంటల సాగు విషయంలోనైన మహిళలు లేనిదే పనులు సాగవు.

వ్యవసాయ రంగంలో పాత్ర

వరినారు తీసి నాట్లు పెట్టడం మొదలు కలుపు తీయడం, మందులు వేయడం, వరి కోతలు కోయడం, అలాగే పత్తి విత్తనాలు పెట్టడం మొదలు కలుపు, పత్తి ఏరేది మహిళలే. ఏ ఇతర పంటల సాగులోనైనా వారి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆకాశంలో సగం, అవనిలో సగం అంటూ పురుషులతో పాటు బాధ్యతలు పంచుకోవడంలో మేమే మిన్న అంటూ నిరూపిస్తున్నారు.

రైతులకు అండగా..

మంచిర్యాల జిల్లాలో మొత్తం 53 ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 216 మంది మహిళలే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సెంటర్‌లో నలుగురు మహిళలు ఆయా గ్రామ సమాఖ్య మహిళా సంఘాల నుంచి పనిచేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమ చూడటం, లెక్కలు రాసుకోవడం, తూకం చూడటం, రైతుల నుంచి ధాన్యం ఎంత తీసుకున్నారో తదితర వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయడం, వాచ్‌మెన్‌గా వ్యవహరించడం తదితర పనులు నిర్వర్తిసున్నారు. గత పదేళ్లుగా ఐకేపీ నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

బుక్‌కీపర్‌గా వ్యవహరిస్తున్నా..



నేను ఎల్లక్కపేటలోని ఐకేపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుక్ కీపర్‌గా వ్యవహరిస్తున్నా. ధాన్యంలో తేమశాతం చూడటం, రైతుల నుంచి ఎంత ధాన్యం తీసుకున్నాం. కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేస్తాను.
– రాజ్యలక్ష్మి, బుక్‌కీపర్

ధాన్యం కొనుగోళ్లు



ఆస్నాదలో ఐకేపీ సెంటర్‌లో ఈ యేడు 25,898 (648) క్వింటాళ్లు) బస్తాల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశాం. గతేడాది కన్నా ఎక్కువ మొత్తంలో కొనుగోలు జరిగాయి.
– రేవతి, ఆస్నాద, సీసీ, ఐకేపీ

గ్రామ సమాఖ్య నుంచి పనిచేస్తారు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గ్రామ సమాఖ్య నుంచి మహిళలు ఇక్కడ పని చేస్తున్నారు. గత పదేళ్లుగా కొనుగోలు కేంద్రాల్లో మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు.
– ప్రమీల, ఏపీఎం, ఐకేపీ, చెన్నూర్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై మురుగునీరు



చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతోంది. గ్రామంలో సరైన డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్డుపై చేరడంతో దుర్వాసన వస్తోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకుని కాల్వలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - అధికారి: విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి, సెల్: 96767 62750

న్యాయసేవాధికార సంస్థలను ఉపయోగించుకోవాలి

- లక్సెట్టిపేట సివిల్ న్యాయమూర్తి అసదుల్ల షరీఫ్



మాట్లాడుతున్న అసదుల్ల షరీఫ్

జన్నారం: న్యాయం కోసం కోర్టుకు వచ్చేవారు డబ్బులు లేవని బాధపడొద్దని, ప్రతి కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థలను ఉపయోగించుకోవాలని లక్సెట్టిపేట సివిల్ న్యాయమూర్తి అసదుల్ల షరీఫ్ అన్నారు. మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు.మండల న్యాయ సేవాధికార సంస్థకు వెళ్లి మీ సమస్యపై దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం న్యాయవాదిని నియమిస్తోందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి ఫోన్లకు మెసేజీలు, లింక్‌లు వస్తే క్లిక్ చేయొద్దన్నారు. మహిళా చట్టాలు, ఫోక్సో, వినియోగదారుల ఫోరం తదితర అంశాలపై వివరించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాండ్ల సత్యనారాయణ, న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, శ్రీధర్, సురేందర్, రహిమతుల్ల, రెడ్డిమల్ల ప్రకాశం, అశోక్, సత్యగౌడ్, రవీందర్, హెచ్ఎం ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, ఎస్సై తానాజీ నాయక్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన



లక్సెట్టిపేట: సిబ్బందితో మాట్లాడుతున్న కాంతయ్య



బెల్లంపల్లిరూరల్: ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల 3వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య మంగళవారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మందికి పరీక్షలు చేశారు.. ఇప్పటివరకు ఎందరికి అద్దాలు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీహరి సిబ్బంది, నాయకులు ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: కంటి వెలుగు వైద్య శిబిరాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్ కోరారు. మాలగురిజాల, లింగాపూర్ గ్రామాల్లో మంగళవారం ఈ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో రాజేందర్, సర్పంచులు అశోక్, వెంకటేశం, ఎంపీటీసీ శకుంతల, సుభాష్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, కంటి వెలుగు వైద్యాధికారి అలేఖ్య, జేపీఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: జనగామ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నవారికి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ అజ్గర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, మండల అధ్యక్షుడు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికులకు సన్మానం



కార్మిక దంపతులను సన్మానిస్తున్న అధికారులు



పోశెట్టిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని పలు గనులపై రిటైర్డ్ అయిన కార్మికులను సన్మానించారు. ఆర్కే 6, ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీపీ గనులపై ఈ సన్మానాలు జరిగాయి. ఆర్కే 6 గనిపై రిటైర్డ్ ఫిట్టర్ డీ పోశెట్టిని సన్మానించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై సన్మానం చేశారు. అనంతరం గని మేనేజర్ ఈ తిరుపతి మాట్లాడుతూ పోశెట్టి శేషజీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారులు రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమ అధికారి సునిల్, టీబీజీకేఎస్ నేతలు పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, ఇప్ప భూమయ్య పాల్గొన్నారు.

– శ్రీరాంపూర్ ఏరియా సేఫ్టీ అధికారి పని చేసి రిటైర్డ్ అయిన గోషిక మల్లేశ్‌ను అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయం వద్ద జీఎం బీ సంజీవరెడ్డి ఇతర అధికారులు మల్లేశ్ దంపతులను పూల మాలతో సత్కరించారు. ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదిర్, ఏరియా ఇంజినీర్ రమేశ్ బాబు, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు గోవింద రాజు, అరవిందరావు, చిరంజీవులు, శివరావు, లా ఆఫీసర్ శిరీషరెడ్డి, ఎస్టేట్స్ వరలక్ష్మి, ఎస్ఈ చంద్రశేఖర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కార్మికుడు నాగుల రాజనర్సుని మందమర్రి ఏరియా శాంతిఖని గని వద్ద సన్మానించారు. రాజనర్సు దంపతులకు గని మేనేజర్, కార్మిక సంఘాల ప్రతినిధులు , సహచర కార్మికులు పూల మాలు వేసి శాలువ కప్పి సత్కరించారు.

కార్మిక క్రీడాకారులకు సత్కారం..

అథ్లెటిక్స్‌పోటీల్లో రాణించిన శాంతిఖని గనికి చెందిన ఇరువురు కార్మికులను సన్మానించారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కార్మిక క్రీడాకారులు ఫక్రుల్ హుదా, కిషన్‌లకు శాలువ కప్పి సత్కరించారు. ట్రిపుల్ జంప్ పోటీలో ఫక్రుల్ హుదా గోల్డ్ మెడల్ సాధించగా, 100 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో కిషన్ సిల్వర్ మెడల్‌ను దక్కించుకున్నాడు. ఇరువురు కార్మికులను గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా అభినందించారు. రక్షణ అధికారి రాజు, బీఎం ఇన్‌చార్జి ముస్తాఫా, వెంటిలేషన్ అధికారి పూర్ణచందర్, ఇంజినీర్లు సైదులు, రాంసాగర్, ప్రవీణ్, కార్మిక సంఘాల ప్రతినిధులు దాసరి శ్రీనివాస్, దాసరి తిరుపతిగౌడ్, గని ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన డెప్యూటీ సూపరింటెండెంట్ గ్రేడ్-ఏ కందుకూరి సోమనర్సయ్య, ట్రామర్‌లు నర్సయ్య, కనుకుంట్ల వెంకటస్వామి, లావుడి సింద్యా కార్మిక దంపతులను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునిల్‌కుమార్, డెప్యూటీ మేనేజర్ నికిల్, సంక్షేమాధికారి మీర్జా గౌస్, కార్మిక సంఘాల నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, బియ్యాల వెంకటస్వామి, మినుగు లక్ష్మీనారాయణ, ఒడ్నాల రాజన్న దుగుట శ్రీనివాస్, బైరి శంకర్, బన్న లక్ష్మణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత కార్యదర్శులదే



పోలంపల్లిలోని నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: హరితహారంలో పెంచుతున్న మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని పోలంపల్లి, భీమారం గ్రామాల్లోని మొక్కల నర్సరీలను ఎంపీవో సతీశ్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీరందించాలన్నారు.

ఆలయంలో మహా పూర్ణాహుతి యాగం

మందమర్రిరూరల్: మందమర్రిలోని బుర్దగూడెం సమీపంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాల్లో భాగంగా రాజ మాతంగి శ్యామలాదేవి యాగం మహా పూర్ణాహుతి ముగింపు కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. నిర్వాహకులు తొమ్మిది రోజులుగా పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు మంథని వాణి సతీశ్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయం ముందు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజార్లు భాజాభజంత్రీలతో గ్రామాల్లో ఊరేగించి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు.

పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

వేమనపల్లి: కొత్తగూడెం ఎస్సీ కాలనీలోని ప్రైమరీ పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా నిర్మిస్తున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో లక్ష్మయ్య మంగళవారం పరిశీలించారు. వీటి పనులను త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ మధుకు సూచించారు. ఏపీవో సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

పీఎస్సార్‌కు వ్యతిరేకంగా సమావేశం

లక్సెట్టిపేట: మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావుకు వ్యతిరేకంగా మండలంలోని తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య ఆధ్వర్యంలో మంగళవారం రహస్య సమావేశం నిర్వహించారు. పార్టీలో లుకలుకల, రాబోయే ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని పార్టీలో జరుగుతున్న విభేదాల కారణంగా సమావేశం నిర్వహించారని తెలిసింది. పార్టీ నేతలు హాజరైనట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల నుంచి నాయకులు విచ్చేసి అసమ్మతిని తెలిపినట్లు సమాచారం.

పల్లెల్లో అభివృద్ధి శూన్యం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



కండువాలు కప్పుతున్న రాథోడ్ రమేశ్

జన్నారం: బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు అందినకాడికి దోచుకుంటున్నారని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. మండలంలోని కొత్తపేట, కవ్వాల్, బంగారుతండా, కొలాంగూడ, హాస్టల్‌తండా గ్రామాల్లో మంగళవారం 'పల్లె గోస, బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పలుకరించారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవ్వాల్ హాస్టల్ తండా గ్రామంలో పలువురు యువకులు బీజేపీలో చేరగా కండువాలు కప్పారు. అనంతరం రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా మారుమూల గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రాజెక్టుల పేరుతో పాలకులు కోట్లు దండుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ దోచుకున్న సొమ్ముతో దేశంలో పర్యటిస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలని కోరారు. ఎంపీటీసీ కొంతం శంకరయ్య, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ నాయకులు, మహేశ్, సురేశ్, కృష్ణ, జగన్‌గౌడ్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, నాయకులు

పాతమంచిర్యాల: మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎస్ఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. భగీరథ పథకంలో పంప్ ఎలక్ట్రికల్, వాల్వ్ ఆపరేటర్లు, లైన్‌మెన్, ఫిట్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్, వాచ్‌మెన్లకు గత నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లు 18 వేలకు పైగా చూపిస్తున్న వారికి మాత్రం రూ.8500, రూ.12 వేల వేతనం అందుతుందన్నారు. ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులు దుర్గం లింగయ్య, ఆసిఫాబాద్ సెగ్మెంట్ ప్రధాన కార్యదర్శి చందు, వెంకటేశ్, అంబాజీ రావు, దుర్గాజీ, మధుకర్, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్, సంకె రవి, అల్లూరి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువకు మరమ్మతు చేయండి

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని చెరువు కాలువకు మరమ్మతు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్‌లో ఏవోకి గ్రామస్తుడు వెంకటేశ్ వినతిపత్రం అందించారు. చెరువు ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాల పంట భూమి ఉందని, కాలువ మరమ్మతు చేయకపోవడంతో బయటకు రాలేకపోతున్నామన్నారు.

టీజీఎల్‌బీకేఎస్ మహాసభలు జయప్రదం చేయండి

మందమర్రిరూరల్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని కామ్రేడ్ యూ.రాములునగర్‌లో ఈనెల 4న నిర్వహించే టీజీఎల్‌బీకేఎస్ 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జాఫర్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

4 నుంచి మహిళలకు శిక్షణ

మంచిర్యాలటౌన్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ లయన్ కవిత ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యూటీషియన్, టైలరింగ్, కంప్యూటర్‌లో మహిళలు, యువతులకు శిక్షణ ఉంటుందని, వివరాలకు 9676532800 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వ నమోదు



మేదరిపేటలో సభ్యత్వ తీసుకుంటున్న పాత్రికేయులు

దండేపల్లి: జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూనియన్ నాయకులు మంగళవారం నిర్వహించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తోందని యూనియన్ జిల్లా సభ్యత్వ బాధ్యులు ప్రకాశ్‌రెడ్డి, సతీశ్ పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు యూనియన్ పరంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మాంతయ్య, సీనియర్ జర్నలిస్టులు ఆకుల రాజు, సురేష్‌చౌదరి, శ్రీనివాస్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

దూడలకు వ్యాధినిరోధక టీకాలు

దండేపల్లి: మండలంలోని గూడెంలో ఆవు, గేదె దూడలకు మంగళవారం వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు. గ్రామంలో గల 4 నుంచి 8 నెలల వయస్సున్న 96 దూడలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. దూడలకు టీకాలు వేయించడంతో ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఎంపీటీసీ మోహన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంకతిపల్లిలో పశువైద్య శిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని అంకతిపల్లిలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది ఆడ పశువులకు బ్రుసెల్లోసిస్ టీకాలను వేశారు. వైద్యాధికారి శ్వేత, సిబ్బంది అనిల్, నందగోపాల్ పాల్గొన్నారు.